# అందని అనుభూతి

శివరావు శిలలా నిల్చుండిపోయాడు. ఆ టౌన్ హాలు గేటు వద్ద అతను గేట్ కీపర్ కాడు. ఆ సమయంలో ఈ రాతిలోకంలోని ఒకానొక ఔత్సాహిక ప్రేక్షకుడతను. ఆ డిసెంబర్ 31 సాయంకాలం టౌన్‌హాల్లో కమలాదేవి నాట్య ప్రదర్శన వుంది. ఆనాట్య ప్రదర్శన ఖరీదుగా వుంది. కడపటి టిక్కెట్టు పాతిక రూపాయలు. శివరావు జేబులో పట్టుమని పది రూపాయలే వున్నాయి.

ఇంతలో ఒక తెల్లని విదేశీ కారు అతణ్ణి రాసుకుంటూ లోపలికి పోయింది. క్షణంలో సగం సేపు కారులో వ్యక్తి వంక చూడగలిగాడు శివరావు. ఆమె కమలాదేవి! దేశమంతటా పేరు ప్రఖ్యాతులు పొందిన నర్తకి. సంప్రదాయాన్ని ధిక్కరించి అభినయంతో స్వచ్ఛంద భావావేశాలకి ప్రాధాన్యం ఇచ్చి కొత్త ఒరవడినీ ఉరవడినీ ప్రవేశపెట్టిన ఘనత ఆమెదే.

ఎన్నాళ్లకి మళ్లీ చూడగలిగాడామని? కొన్నేళ్ల కిందట తను విద్యార్థిగా వున్నప్పుడు కాలేజీలో నాట్య ప్రదర్శన యిచ్చింది. శరీరం మెరుపు తీగ ఎలా అవుతుందో, మెరుపు తీగ మెలికలెలా తిరుగుతుందోఆమెలో చూశాడు. మళ్లీ యిన్నాళ్లకి ఆరోజే తెలిసింది ఆమె ప్రదర్శన వుందని. ఆఫీసులో అతి కష్టం మీద పర్మిషన్ సంపాదించి ఆగమేఘాల మీద వచ్చాడు. కాని ఎలా? పది రూపాయలకీ పాతిక రూపాయలకీ ఎంత దూరం? తెల్లారితే కొత్త సంవత్సరం. ఇంట్లోనూ జేబులోనూ కలిపి పది రూపాయలు.

కార్లూ స్కూటర్లూ ఎన్నో లోపలికి వెళుతున్నాయి. వాటి వంక నిర్లిప్తంగా చూస్తుండిపోయాడు శివరావు. అవన్నీ కాలక్షేపం కోసమే నన్పించింది. వాటివంక చూడడం కన్న పదిహేను రూపాయలు అప్పివ్వ గలిగిన పరిచయస్తుడి కోసం వెదకడం మంచిదనిపించింది. కానీ ఎంత సేపు నిలబడినా తెలిసిన మొహం ఎక్కడా కన్పించలేదు. శివరావులో ఆదుర్దా ఎక్కువైంది. ఆలస్యమైతే టిక్కెట్లు దొరకవేమో.

హాల్లో కోలాహలం ఎక్కువై ఒక్కసారిగా సద్దుమణిగింది. ప్రదర్శన ప్రారంభమై వుండాలి. చూస్తుండగానే గేటుమూసేశారు. శివరావు మనస్సు వికలమైంది. మెల్లగా రోడ్డు మీదికి వచ్చి నడవసాగాడు. ఎందుకో ఉక్రోషం. ఎదురుగా రాయి కన్పించింది. కాలితో

ఒక్క తన్ను తన్నాడు. కొంత దూరం దొర్లి ఆగిపోయిందది. మళ్లీ బలంగా తన్నాడు. ఈ సారి అది ఎగురుకుంటూ వెళ్లి ఎదురుగా వచ్చే కారు బంపర్‌కి తగిలి ఆగియింది. కారు శివరావు పక్కగా ఆగింది.

"హల్లో రావ్! ఎందాకా?"

శివరావు ఉలిక్కిపడి తలెత్తి చూశాడు. కార్లో ఒకప్పటి స్నేహితుడు సూర్యం. తడబాటు కప్పి పుచ్చుకుని చిరునవ్వు నవ్వాడు అంతరాంతరాల్లో ఇష్టం లేకపోయినా. అలా ఎన్నోసార్లు మొహానికి చిరునవ్వు పులుముకుంటూనే వచ్చాడు శివరావు.

"అబ్బే ఎక్కడికీ లేదు. ఊరికే యిలా వచ్చాను".

"అయితే కారెక్కు. మంచి పార్టీకి వెళదాం. రేపు న్యూయియర్ గదా! రింగవుట్! కమాన్. ఎన్నో రోజులకి కలిశాం" అంటూ డోరు తీశాడు.

శివరావు అప్రయత్నంగానే కారెక్కాడు. కారు ట్రాఫిక్‌ను తప్పించుకుంటూ మెల్లగా వెళుతోంది. శివరావు సూర్యం మాటలువింటూ ఆలోచనలో పడ్డాడు. ఈ కారెందుకెక్కాడు తను? సూర్యం తనకు ప్రాణస్నేహితుడు కాడు. తనకి ఉద్యోగం రాకముందు ఇద్దరూ కలిసి తిరిగేవాళ్లు. సూర్యానికి ఉద్యోగంతో నిమిత్తం లేదు. ఎన్నో కంట్రాక్టులున్నాయి. అక్రమంగా సంపాదిస్తూ సక్రమంగా తగలెయ్యడమే అతని పని. శివరావు తన ఆర్థిక పరిస్థితి దిగజారే కొద్దీ సూర్యానికి దూరమవుతూ వచ్చాడు. కనాకష్టంగా కుటుంబం లాగుతున్న తనకీ, కారూ క్లబ్బూ మెయింటైన్ చేస్తున్న సూర్యానికీ సమాన స్థాయిలో స్నేహం సాగదని తేల్చుకున్నాడు. అతను దూరమవు తున్నందుకూ సూర్యం కూడా ఏమంత విచారించినట్టు లేదు. అతని వలయం పెద్దది. శివరావు స్థానంలో ఎవరినైనా భర్తీ చేసుకోగలడు.

శివరావు సూర్యానికీ ఎడం కావడానికి అతని మొహం కూడా ఒక కారణమేనని చెప్పొచ్చు. వ్యాపారం అభివృద్ధి చెందే కొద్దీ సూర్యానికి ఎదుటివాళ్లని సులభంగా అంచనా కట్టే గుణం అబ్బింది. మాటల్లో ఇతరులకి దొరకని అల్లిక వచ్చింది. నిరంతరం లోకాన్ని హేళన చేస్తున్నట్టు పెదాలపైకి సన్నని చిరునవ్వు చేరింది. దాంతో శివరావు సూర్యంతో స్నేహబంధం కోల్పోయాడు. కాబట్టి స్నేహాన్ని కోల్పోవడం మంచిదనిపించింది. ఈనాటికి అతని కారే అనుకోకుండా ఎక్కేశాడు. అదంత ఘోరమైన తప్పిందం కాదనిపించింది. నాట్య ప్రదర్శన ఎలాగూ చూడలేకపోయాడు. పోనీ, ఈ అనుభవం ఎలా వుంటుందో చూద్దాం అనుకున్నాడు.

కారు జీవన్ రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో ఆగింది. లోపల పెద్దహాలు, ఖరీదైన అలంకరణ, 'వెల్‌కమ్', 'హాపీన్యూయియర్' వైర్లతో బల్బులు వెలుగుతూ ఆరిపోతూ వున్నాయి. అప్పటికే ఎంతో మంది ప్రముఖులు చేరారు. కొందరు జంటలుగా ఇంకొందరు ఒంటరిగా దాదాపు అందరూ పట్నంలో పేరుపొందిన ధనవంతులే అని శివరావు సులభంగానే

గ్రహించాడు. అందరి తోనూ సూర్యం పరిచయం అయింది. 'హలో' 'హాయ్' 'హౌడుయుడు'లతో శివరాం రావునీ కొంతమంది స్నేహితులకి పరిచయం చేశాడు సూర్యం. వాళ్లలో ఒకరిద్దరు శివరావు కింతకు ముందు నుంచే తెలుసు, సూర్యం ద్వారా.

పార్టీ ప్రారంభమైంది నవ్వుల్తో, కేరింతల్తో, మందుగ్లాసుల్తో ఎవరో శివరావుకి ఒక పెగ్గు ఆఫర్ చేశారు కానీ అతను తీసుకోలేదు. సూర్యానికి తెలుసు, శివరావు తాగడని. అయినా బలవంతం చేశాడు.

"నా కోసమైనా పుచ్చుకోక తప్పదోయ్! జన్మలో ఒక్కసారైనా తాగకుండానే చనిపోతావా? పిటీ! కానివ్వు కానివ్వు. లేక పోతే ఇంతమందిలో నాకు షేమ్‌గా వుంటుంది. సోషల్ మూవింగ్ లేకపోతే యెలా?"

శివరావుకి తప్పలేదు. గ్లాసు పుచ్చుకుని ఒక్క గుటక వేశాడు. గొంతు మండింది.

"దట్స్ గుడ్" అన్నాడు సూర్యం.

బలవంతంగా రెండు గుక్కలు మింగే సరికి తల దిమ్మెక్కింది. కొంచెం మైకం. ఎవరెవరో మాట్లాడుతున్నారు. నవ్వుకుంటున్నారు. ఆడవాళ్ల చేతుల్లోనూ సిగరెట్లూ విస్కీ గ్లాసులూ, శివరావు వాళ్ల వంక గుడ్లప్పగించి చూడసాగాడు. ఇరవై నుంచి నలభై దాకా అన్ని వయసుల ఆడవాళ్లూ వున్నారు. ఎవరి మొహమూ సహజంగా కన్పించలేదు. కేకూ, పౌడర్ల మయంగా వున్నాయి. పెదాలూ, గోళ్లు రంగు రంగుల పూతల్తో మెరిసిపోతున్నాయి. కొత్త కొత్త నగిషీ చీరలు లైట్ల వెలుగులో తళతళలాడుతున్నాయి.

"ఎవరన్నా నాలుగు జోకులు చెప్పండోయ్" అరిచారెవరో గుంపుమధ్యలో.

"నేను చెబుతాను" అంటూ చెయ్యిపైకెత్తాడొకాయన. వయస్సు నలభై వొండొచ్చు గుండ్రంగా ఆపిల్ పండులా వున్నాడు. చేతిలో గ్లాసు పూర్తి చేసి అందుకున్నాడు.

"మా వాడికి లోక్లాస్ అంటె ఎలర్జీ. ఒక రోజు సినిమాకి వెళ్లాడు. ఇంటర్వెల్‌లో చూసేసరికి సెకండ్ క్లాస్‌లో వాడి పెళ్లాం మరెవడి పక్కనో కనబడింది. మా వాడికి పిచ్చికోపం వచ్చింది. అమాంతం వెళ్లి పెళ్లాన్ని చెడామడా దులిపేశాడు. ముందుగా చెబితే ఫస్ట్ క్లాస్ టికెట్స్ రిజర్వ్ చేయించే వాణ్ణిగదా అని"

అందరూ గొల్లుమన్నారు ఆడవాళ్లతో సహా. శిరావుకి నవ్వురాలేదు. చిరాకేసింది. ఇంతలో మరొకాయన అందుకున్నాడు.

"నేనో జోకు చెబుతాను. సుబ్బారావు కంప్యూటర్ సైంటిస్ట్. ఓ రోజు కొత్త కంప్యూటర్‌ని పరీక్షిద్దామని ఓ ప్రశ్న వేశాడు. ఈ టైంలో మా ఫాదర్ ఏం చేస్తు న్నాడో చెప్పమని. చేపలు పడుతున్నాడని ఆన్సర్ వచ్చింది. నో, మా ఫాదర్ అప్పా రావు ఫలానా ఆఫీసులో వున్నాడని చెప్పాడు సుబ్బారావు. అప్పుడు కంప్యూటర్ అప్పారావు ఫలానా ఆఫీసులో వుండొచ్చు. మీ ఫాదర్ మాత్రం చేపలు పడుతున్నాడని చెప్పింది."

మళ్లీ జనమంతా నవ్వారు. ఆ జోకు ఎక్కడో చదివినట్టనిపించింది శివరావుకి.

అలా అలా ఓ అరగంట జోకుల పర్వం సాగింది. జనం నవ్వి నవ్వి అలిసిపోయారు. డ్రింక్స్ ఒక రౌండ్ ముగిసి రెండో రౌండ్ మొదలైంది.

"ఈ ఆనంద సమయంలో ఎవరైనా మంచి పాట పాడాలి" అని ప్రతిపాదించాడు సూర్యం. పాటలంటే ఆసక్తి వుందని శివరావుకి తెలీదు.

"మిసెస్ జ్యోతీ కల్యాణ్ బాగా పాడుతుంది" అన్నాడొక సూట్‌వాలా. అతను లాయర్. పార్టీ మొదలైనప్పటి నుంచీ ఆమెవంకే తినేసేట్టు చూశాడు. ఆమె నవ్వితే తనూ నవ్వుతున్నాడు.

"జ్యోతి ఈ క్లబ్ ప్రెసిడెంట్ భార్య. వెరీయాక్టివ్. స్పెషల్ అట్రాక్షన్ ఆఫ్‌ది ఈవెనింగ్" అన్నాడు సూర్యం శివరావుతో.

ఆ విషయం శివరావు గమనించాడు. పార్టీకి వచ్చినప్పటి నుంచీ జ్యోతి కల్యాణ్ ఒక్క క్షణమైనా నిశ్శబ్దంగా వున్నట్టు లేదు. ఎవరెవరితోనో మాట్లాడుతూ పగలబడి నవ్వుతూ, కళ్లు చక్రాల్లా తిప్పుతూ అటుఇటూ పరిగెత్తుతూ ఎంతో బిజీగా సరదాగా వున్నట్టు కన్పింస్తోంది. ఎర్రని రంగు లిప్‌స్టిక్, మెళ్లో పగడాల హారం, ఎర్రని కంచిపట్టు చీర ఒకదానితో మరొకటి పోటీ పడుతున్నాయి.

"నోనో, ఐ కాంట్. నాకసలే సిగ్గమ్మా' అంది జ్యోతీ కల్యాణ్ మెలికలు తిరిగిపోతూ, ఆమెలో ఏ కోశానా సిగ్గు, బిడియం వున్నట్టు శివరావు నమ్మలేకపోయాడు.

"అదేం కుదరదు. పాడాలి, పాడాలి" అన్ని వైపుల నుంచీ కేకలు.

ఆ కేకలు భరించలేనట్టుగా ఇక పాడతానన్నట్టు జ్యోతీ కల్యాణ్ చేతులు పైకెత్తింది. హాలంతా నిశ్శబ్దమైంది. ఆమె గొంతు సవరించుకుంది. మూడ్‌లోకి వెళుతున్నట్టు ఒక్కక్షణం కళ్లు మూసుకుంది. తర్వాత పాట అందుకుంది.

"నవ్వడమేగా జీవితం మనసు ఇవ్వడమేగా జీవితం..."

ఏదో సినిమాలో పాట. పాడుతున్నంత సేపూ జ్యోతీ కల్యాణ్ చిటికెలు వేస్తూ కాలితో కార్పెట్ మీద తాళం వేస్తూ నలుగురి మొహాల్లో రియాక్షన్ చూస్తూ కొనసాగించింది. గొంతు బొంగురుపోయినట్టయింది. అక్కడక్కడా అపస్వరాలు పలికాయి. శివరావు ఏ మాత్రం ఆనందించలేకపోయాడు. కమలాదేవి గుర్తుకొచ్చింది. "నేనెందుకొచ్చానిక్కడికి? ఈ మనుషులెక్కడి వాళ్లు ? ఏ లోకంలో బతుకుతున్నారు?" అనుకున్నాడు. ఆప్రదేశంలో తన లాంటి వాడి ఉనికి తగదనిపించింది. లోపల్నుంచి ఎవరో 'ఆడ్‌మాన్! ఓ ఆడ్‌మాన్!' అని అరుస్తున్నట్టు తోచింది.

తర్వాత గ్రూప్ డాన్స్ ప్రారంభమైంది. స్టీరియో లోంచి సన్నగా పాశ్చాత్య సంగీతం. జంటలు, జంటలుగా ఒకరినడుం చుట్టూ మరొకరి చేతలు. ఒకరి భార్యతో మరొకరు. లయబద్ధంగా ఏదో ప్రశాంత లోకంలో వున్నట్టు మత్తుగా కదుల్తున్న పాదాలు. మైకంతో మూసుకుపోతున్న కళ్లు. రానురాను సంగీతం వేగం పుంజుకుంది. అడుగులు

తడబడుతూ గెంతులుగా మారాయి. శివరావు ఒక మూలగా నిలబడి చూస్తుండిపోయాడు. ఆడ్‌మాన్ అవుట్! ఇంతలో ఊహించని విధంగా జ్యోతీ కల్యాణ్ శివరావు దగ్గరకి వచ్చి చెయ్యి పట్టుకులాగింది.

"కమాన్ మాన్! లెటజ్ డాన్స్"

శివరావు తప్పించుకోలేకపోయాడు. ఎంతోమందికి దక్కని ఛాన్స్ తనకి దక్కినట్టు గమనించలేకపోయాడు. అయిష్టంగానే కదిలాడు. జ్యోతీ కల్యాణ్ అతని చేతులు పట్టుకుని అటు ఇటూ తిప్పింది. ఆమె నోట్లోంచి సిగరెట్, విస్కీ కలగలసిన వాసన. శివరావుకి కడుపులో తిప్పినట్టయ్యింది. సూర్యం ఎవరితోనో డాన్స్ చేస్తూ అతణ్ణి చూసి నవ్వాడు.

సరిగ్గా పన్నెండు గంటలైంది. అందరూ డాన్స్ ఆపారు. పాత సంవత్సరానికి గుడ్‌బై చెప్పారు.

"హాపీ న్యూయియర్!"

పరస్పరం కౌగిలింతలు. మళ్లీ బాటిల్స్ మూతలు లేచాయి. శివరావుకి తల తిరుగుతున్నట్టనిపించింది. ఇక అక్కడ వుండలేకపోయాడు. గుంపు నుంచి విడివడి సూర్యంతో వెళ్లొస్తానని చెప్పాడు.

"నేనూ వస్తాను పద. పొద్దుపోయింది" అని సూర్యం కూడా స్నేహితులకి చెప్పి బయల్దేరాడు. కారు కదిలింది.

"పార్టీ థ్రిల్లింగ్‌గా వుంది గదూ?" అన్నాడు సూర్యం.

"థ్రిల్లింగ్ అంటే?"

సూర్యం నవ్వాడు. "థ్రిల్లింగ్ అంటే థ్రిల్లింగ్..ఐ కాంట్ ఎక్స్‌ప్లెయిన్. ఎ ఫైన్ ఎక్స్‌పీరియన్స్ దట్సాల్"

శివరావు మాట్లాడలేదు. అతనికి చాలా చిరాగ్గా వుంది. కమలాదేవి నాట్యం చూళ్లేనందువల్ల కలిగిన అసంతృప్తి పార్టీ వల్ల మరింత ఎక్కువైంది.

"జ్యోతీ కల్యాణ్‌తో డాన్స్ చేస్తుంటే నీకేం అనుభూతి కలగలేదా? ఆమె కడగంటి చూపు కోసం పడి చచ్చేవాళ్లున్నారు"

"కావచ్చు. కానీ ఆమె నా చేతులు పట్టుకున్నంత మాత్రాన నాకెందుకు అనుభూతి కలగాలి? నాలాంటి ఎంతోమందితో ఆమె డాన్స్ చేసి వుంటుంది. ఆమె నడక, నవ్వు, నాట్యం, అందం అన్నిటి మీదా ఏవో పొరలున్నాయి. నీటి మీద నూనె పొర చూస్తే నాకెంతో అసహ్యం" అన్నాడు శివరావు విండో గ్లాస్ లోంచి బయటికి చూస్తూ. వీధిలైట్లు, భవనాలూ దాటిపోతున్నాయి.

"అనుభూతులు లేనివాడివి నువ్వు". అన్నాడు సూర్యం నవ్వుతూ.

శివరావుకి చురుక్కుమంది.

"కాదు అనుభూతి కోసం వెదుకుతున్న వాడిని. అనుభూతికీ, థ్రిల్ కీ తేడా తెలీని

వాణ్ణిమాత్రం కాదు" అన్నాడు శివరావు వెంటనే. "లేని వుత్తేజం కోసం సినిమాలకీ షికార్లకీ, పార్టీలకీ వెళ్లి అరువు మాటల్తో పాటల్తో, జోకుల్తో దేన్నో బతుకులోకి ఫీడ్ చెయ్యాలని చూస్తున్నాం. అది జీవశక్తి కాదు. నార్కోటిక్ డ్రగ్. నువ్వు కొనుక్కోగలవు.".

ఆ ధోరణికి సూర్యానికి కష్టం వేసింది. "నిన్ను పార్టీకి తీసుకెళ్లడం నాది బుద్ధి తక్కువ" అన్నాడు సాధ్యమైనంత సౌమ్యంగా.

"అవును" అన్నాడు శివరావు నిదానంగా. "కారాపు"

"అదేం? ఇంకా దూరం వుందిగా మీ యిల్లు?"

"ఫర్వాలేదు. నడిచివెళతాను" అని కారాగగానే డోరుతీసి దిగాడు శివరావు. సూర్యం 'గుడ్నైట్' చెప్పాడు. కారు సాగిపోయింది.

సూర్యంతో ఆ విధంగా మాట్లాడకుండా వుంటే బాగుండేదేమో అనుకున్నాడు శివరావు నడుస్తూ. తల దిమ్ము తగ్గలేదు. తన నోటివాసన తనకే అసహ్యంగా వుంది. మెయిన్ రోడ్డు దాటి సందులోకి దారితీశాడు. ఎక్కడో ఒకటీ అరా వీధిలైట్లు వెలుగుతున్నాయి. అటు ఇటూ మురుగు కాల్వల వాసన, చెత్తకుండీ పక్కన కుక్క శివరావుని చూసి మొరిగింది. ఇల్లు చేరాడు. ఒకే యింట్లో నాలుగు వాటాలు. ఒక్కో వాటాలో రెండు గదులు. శివరావు తలుపుతట్టగానే 'ఎవరూ' అంటూ భార్య దగ్గుతూ వచ్చి తలుపు తీసింది.

'జీవితాంతం ఇదిలా దగ్గుతూనే వుంటుంది' అనుకున్నాడు శివరావు. లోపలకి నడవగానే విస్కీ వాసన గప్పుమని సోకింది వకుళకి. భర్త మొహం వంక తేరిపార చూసింది ఆశ్చర్యంతో. శివరావుకి రోషం వచ్చింది. 'ఎప్పుడూ ఇంతే. విషయం ఏమిటని సూటిగా అడగనే అడగదు.

'తాగాను' అన్నాడు నిర్లజ్జగా,నా యిష్టం అన్నట్టు.

" ఆడబ్బు పెడితే చిన్నదానికి పాలడబ్బా వచ్చేదిగా?" అంది వకుళ మెల్లగా.

శివరావుకి కోపం వచ్చింది. తన జబ్బు సంగతి ఎప్పుడూ చెప్పదు. తనే పట్టించుకోవాలని కాబోలు. నీరసంతో ఎండిపోయి పిల్లలకి పాలు కూడా లేకుండా చేసుకుంది. తన ఖర్చుతో తాగలేదని చెబుదామా అనుకుంటూ 'నాయిష్టం' అన్నాడు.

వకుళ మాట్లాడలేదు. ఆమె మౌనం మరింత కోపం తెప్పించింది. బట్టలు మార్చుకుని పెద్దపిల్ల పక్కన పడుకున్నాడు. ఒక్కసారి వళ్లు విరుచుకున్నాడు. కాళ్లకి గోడ తగిలింది. చేతులకి అలమార తగిలింది. ఇన్నేళ్ల నుంచి మంచి యింట్లోకి మారలేక పోయాడు. కనీసం మంచి మంచమైనా కొనుక్కోలేకపోయాడు. పెళ్లయినప్పటినుంచీ వెడల్పాటి మంచం, పరుపు కొనుక్కోవాలనీ తెల్లని పక్కమీద విశ్రాంతిగా పడుకోవాలనీ అనుకుంటూనే వున్నాడు. అది కోరరాని కోరికేం కాదు. కానీ యింతవరకూ తీరలేదు. పిల్ల మీద పిల్ల పుట్టుకొచ్చినంతగా జీతంలో ఇంక్రిమెంట్లు మాత్రం పుట్టుకురాలేదు. పుట్టిన పిల్లల్లో ఇద్దరు పురిట్లోనే పోయినా ఆమాత్రపు సంసారం ఈదడానికే తల ప్రాణం

తోకకొస్తోంది. రోజు వెనక రోజు గడిచిపోతూ వుంది. అగ్గిపెట్టెలాంటి యిల్లు. బూజు పట్టిన కప్పు, పిల్లల ఉచ్చల్తో వాసన కొట్టే మంచం. తలుపులేని స్నానాల దొడ్డి, ఏ మాత్రం బెసకడానికి వీల్లేని మరుగుదొడ్డి. మార్పులేని బతుకు. ఏమైంది తన స్వప్నం? గొప్ప రచయిత కావాలనీ సమాజానికెంతో ఉపయోగ పడాలనీ కన్న కల కళ్లముందే కరిగి పోయింది.

పక్కకి తిరిగి చూశాడు. అటుపక్క మంచంలో చిన్నపిల్లతో పాటు వకుళ పడుకుని వుంది. రేగిన తల, పాలిపోయిన చెక్కిళ్ళు, వడిలిపోయిన ఆకారం. లోలోపల ఏదో కసి. ఎక్కడో జ్యోతీ కళ్యాణ్ స్పర్శ. శివరావు భార్యని చేత్తో తాకాడు.

"నాకేం బాగో లేదు" అంది వకుళ కళ్లు తెరిచి.

"ఎప్పుడు మాత్రం బాగుందని?"

వకుళ మాట్లాడలేదు. పెద్దపిల్లని తన మంచంలో పడుకో బెట్టి భర్త పక్కలో పడుకుని శరీరం అప్పగించింది. శివరావులో ఉద్రేకం చల్లారింది. కానీ అసంతృప్తి తీరలేదు. మనస్సు వెలితిగా వుంది. అలసటలో భారంగా వూపిరి పీలుస్తున్న వకుళ మీద జాలి కలిగింది. తన మీద తనకే అసహ్యం వేసింది. ఎందుకిలా తను రోజు రోజుకీ మారిపోతున్నాడు? జీవితంలో ఏ అనుభూతీ తనకి దక్కకుండా జారిపోతున్నదేమిటి? మనసెందుకు మొద్దు బారిపోతున్నది? అందమైన దాంపత్య జీవితాన్ని పొంద లేకపోవడానికి కారణమేమిటి?

శివరావు మనస్సులో ఏదో కలత, సంక్షోభం ప్రారంభమయ్యాయి. ఎంతోసేపు అలానే కళ్లు తెరుచుకుని మంచం మీద కూర్చుండిపోయాడు. ఎప్పుడో మరిచి పోయిన కవిత్వం గుర్తుకొచ్చింది. లోనుంచి ఆవేశం తన్నుకు రాగా పైకి లేచి కాగితం, కలం తీసుకుని రాయసాగాడు.

నా హృదయం ఎక్కడో జారిపోయింది
అనుభూతిని కోల్పోయాను
ఆవేశం కోల్పోయాను
నేనిప్పుడు రాయిలా మారిన మనిషిని
ఎగసిపడే కోరికలన్నీ
నామీదగా నడుచుకుంటూ వెళ్లిపోయాయి. జీవితం వేళ్లసందుల్లోంచి పారిపోయింది
నాహృదయం ఎక్కడో జారిపోయింది.....

కలం ఆగిపోయింది. ఇంకేమో రాద్దామనుకున్నా రాయలేక పోయాడు. రాసిందంతా ఒక్కసారి చూశాడు. తర్వాత ఆ కాగితాన్ని ముక్కలుముక్కలుగా చింపి మూలన పడేసి పడుకున్నాడు. నిద్ర రావడం లేదు. ఏవేవో వూహలు. గతించిన రోజులు గుర్తుకొస్తు న్నాయి. కమలాదేవి నృత్యం చూసి మనసు పురివిప్పిన రోజులు. బీథోవెన్ 'ఫేట్ సింఫొనీ' మెండెల్సన్ వయొలిన్ విని నరాలు తీగలైన రోజులు. రోడ్డుమీద దిక్కులేని శవాన్ని చూసి

వ్యవస్థని శపించిన రోజులు. సుధారాణి కన్నుల్లో ఆ వెన్నెలపై కవిత్వం రాసిన రోజులు. ఆ వెన్నెల గీతాలు ఏ యిసుక ఎడారుల్లో ఇంకిపోయాయి.

చిన్నతనం నుంచీ దిక్కులేని జీవితం తనది. సవతితల్లి కింద దాదాపు అనాధగానే పెరిగాడు. బీదరికంలో జీవిత బీభత్సాన్ని చూశాడు. అందువల్లనే కాబోలు ప్రపంచంలో ఏ దుర్మార్గం చూసినా గుండె తరుక్కుపోయేది. రైల్లో ఏ గుడ్డి బిచ్చగాణ్ణి చూసినా, రోడ్డు పక్క దుమ్ములో ఏ పోలియో పిల్లవాణ్ణి చూసినా, అర్ధరాత్రి చలిలో పేవ్‌మెంట్ మీద పడుకున్న ఏ అనాధను చూసినా ఆ దారుణానికి తనే కారణమనిపించేది. అలా అనిపించడమే సుధారాణితో తన స్నేహానికి కారణం. ఆమెకీ అదే విధమైన అభిప్రాయాలుండేవి. సమాజం మీద ప్రేమపూర్వకమైన ద్వేషంతో ఎన్నో కవితలు, కథలు రాశాడు. సుధారాణి ఎంతో ప్రోత్సహించింది. అడుగడుగునా విమర్శిస్తూ ప్రోత్సహించింది.

సుధారాణితో స్నేహం ప్రేమకు దారి తీసింది గానీ పెళ్లికి దారి తీయలేకపోయింది. చదువు పూర్తికాకముందే తండ్రి చనిపోయాడు. ఇంటి బాధ్యత నెత్తి మీద పడింది. ఆదర్శాలకి తిలోదకాలిచ్చి ఇష్టంలేని గుమస్తాగిరీకి తలవంచాల్సి వచ్చింది. ఇంటి మీద అప్పు తీరడానికి సుధారాణితో పెళ్లి పనికి రాదని తేలిపోయింది. ఆమె అందం, అద్దంలాంటి హృదయం జీవిత సమస్యలు తీర్చడానికి ఉపకరించలేవని అర్థమైంది. రెండోసారి తన హృదయాన్ని చంపుకుని, సుధారాణిని వదులుకుని, అంతోయింతో కట్నం తెచ్చిన వకుళను పెళ్లాడాడు. కానీ కట్నంతో పాటు జబ్బును వెంట తెచ్చు కుంది వకుళ. వెంట వెంటనే పిల్లలు, పురుళ్లు, జబ్బులు, కళ్లు మూసి తెరిచేసరికి మంచుగుట్టలో నిలువెల్లా ఇరుక్కు పోయాడు. మనస్సూ, శరీరమూ మొద్దుబారి పోయాయి. ఆదర్శాలూ, కవిత్వాలు ఆవిరైపోయాయి. ఎటూ చలనం లేని బతుకు.

సుధారాణి ఇప్పుడెక్కడుందో? గత స్మృతులు గుర్తుకురాగానే శివరావు గుండె బరువెక్కింది. బలవంతంగా ఆమె రూపాన్ని కళ్ల ముందు నుంచి చెరిపెయ్యాలని ప్రయత్నించాడు. ఆ ఆలోచనల్లో పడి ఎప్పుడు నిద్రపోయాడో అతనికే తెలీదు.

తెల్లారింది. పిల్లల ఏడ్పుల మధ్య కొత్త సంవత్సరంలో ఆలస్యంగా నిద్రలేచాడు శివరావు. అంట్లు తోముతోంది వకుళ. పిల్లలు తన్నుకుని ఏడుస్తున్నారు. శివరావు కాసేపు సముదాయించబోయాడు. ఏడ్పులు మానలేదు. కోపంతో మరి రెండు దెబ్బలు వేశాడు. ఏడ్పులు తారాస్థాయికి చేరాయి. 'వెధవ జీవితం. శాంతి లేకుండా పోతోంది' అనుకున్నాడు. పాలమనిషి వచ్చి డబ్బులడగటంతో అది ఫస్టు తారీకని గుర్తు కొచ్చింది. రెండు రోజులు ఆగమని చెప్పాడు. ఆమె శివరావు వంక అదోరకంగా చూస్తూ వెళ్లిపోయింది. శివరావుకి మండిపోయింది. 'పోసేవి నీళ్లు. వెటకారానికి మాత్రం లోటులేదు. ఈ నెలలోనైనా దీన్ని మాన్పించాలి' అనుకున్నాడు. ఈ మాట అనుకోవడం ముప్పయ్యోసారో నలభయ్యోసారో. మాన్పిస్తే మళ్లీ పోసేదెవరు?

వకుళ కాఫీ ఇచ్చింది. నీళ్ళ కాఫీ తాగి శివరావు లేవెటరీకి బయల్దేరాడు. లావెటరీకీ శివరావు జీవితానికీ అవినాభావ సంబంధం వుంది. నాలుగు వాటాల వాళ్లకీ కామన్‌గా ఒకే మరుగుదొడ్డి. ఇరవై నాలుగు గంటలూ దానిముందు క్యూ పద్ధతే. శివరావు తన జీవితంలో గొప్ప క్రమశిక్షణ అక్కడే నేర్చుకున్నాడంటే అతిశయోక్తి కాదు. లావెటరీకీ పోవాలంటే నడవాలోంచి ఒకటే సన్నటి సందు ఎప్పుడూ చిత్తడి. దొడ్లో దుర్గంధం తప్ప గాలీ వెలుతురు కోసం ఆశించి లాభం లేదు. మనిషి లోపలికి వెళ్లి తలుపు ముయ్యడం కష్టం. బిగడం కష్టం. ఏమాత్రం కాలో చెయ్యో కదిలినా అటా ఇటో బెత్తికలూడిన గోడ తగులుతుంది. ఆ స్పర్శ శివరావు శరీరంలో మనస్సు లో ఎన్నో భాగాల్ని మొద్దుబారజేసింది.

కాలకృత్యాలు ముగించుకునేసరికి పొద్దెక్కింది. ఆదర బాదరా వేడి వేడి మెతుకులు నోట్లో వేసుకొని ఆఫీసుకి బయల్దేరాడు. తీరా చొక్కా వేసుకునే సరికి జేబులో వుండాల్సిన పది రూపాయిల నోటు కన్పించలేదు. శివరావు గుండె గుభేలుమంది. చొక్కావిప్పి దులిపాడు. ఇల్లంతా గాలించాడు. ఎక్కడా కన్పించలేదు. ఏమైనట్టు? రాత్రే ఎక్కడో జారిపోయుండాలి. లేదా ఏవడైనా కొట్టేశాడేమో? ఎవరితోనూ అంత దగ్గరగా మసలినట్టు కూడా లేదే? ఒక్క జ్యోతీ కళ్యాణ్‌తోనే దగ్గరగా మసలాడు. ఒకవేళ ఆమె కొట్టేసిందేమో? అంత ఆందోళనలోనూ తన ఆలోచనకి తనకే నవ్వొచ్చింది. ఇంతకీ ప్రస్తుతం ఎలా? ఇంట్లోవున్నది ఆ పది రూపాయిలే. ఆఫీసుకి వెళ్లి రావాలంటే సిటీబస్ ఎక్కక తప్పదు. హడావుడిగా ఇల్లంతా గాలించాడు. కొంత చిల్లర దొరికింది. ఒక్కసారి వూపిరి పీల్చుకుని పరుగులాంటి నడకతో ఆఫీసుకి బయల్దేరాడు. జనవరి ఫస్ట్‌న కూడా రమ్మన్న సూపరింటెండెంట్‌ను తిట్టుకుంటూ. ఆ సమయంలో అతనికి ఆ పది రూపాయిలూ రాత్రి నృత్య ప్రదర్శన కోసం ఖర్చు పెట్టదలుచుకున్న విషయం గుర్తుకురాలేదు.

సందు దాటి రోడ్డు మీదికి రాగానే సిటీబస్సు ముందు స్టాపుకి వెళుతూ కన్పించింది. ఆగమేఘాల మీద పరిగెత్తి బస్సు అందుకున్నాడు. మనస్సు కొంచెం కుదుట పడింది. కనీసం చెమట తుడుచుకుందామన్నా వీల్లేనంత ఒత్తిడి. ఆ ఒత్తిడికి గొంతుల్లో మెతుకులు బయటికొస్తాయేమో నన్పించింది. సమయానికి ఆఫీసు చేరగలడో లేదో? ఆలస్యమైతే సూపరింటెండెంట్ ఏమంటాడో? అసలే తనంటే మంట. ఎందుకో తెలీదు. అతను వేసే వెధవ జోకులకి నవ్వనందుకేమో? గత నెలలో నాలుగైదుసార్లు ఆఫీసుకి ఆలస్యమైంది. కనీసం మేనేజర్ని మంచి చేసుకునే లౌక్యమైనా లేకపోయింది తనకి. ఆ ఆలోచనల్లో వుండగానే తమ దిగాల్సిన స్టాప్ వచ్చింది. బస్సు ఆగీ ఆగగానే కిందికి దూకి చక చకా నడవసాగాడు. బస్‌స్టాప్ నుంచి వంద గజాల దూరం ఆఫీసు.

బస్సు దిగి నాలుగడుగులు వేశాడో లేదో ఏదో కారు సర్రుమంటూ తనని దాటి వెళ్లిపోయింది. కొంచెం దూరం వెళ్లి సడన్ బ్రేక్‌తో ఆగిపోయింది. శివరావు అది గమనించే

స్థితిలో లేడు. ఇంతలో కార్లో నుంచి ఎవరిదో పిలుపు విన్పించింది.

"శివా!"

ఈ ప్రపంచంలో ఒక్కరే తననలా పిలిచేది. శివరావు కళ్లెం లాగినట్టు ఆగిపోయాడు. కారు ముందు సీట్లో సుధారాణి! క్షణకాలం తన కళ్లని తనే నమ్మలేక పోయాడు. ఎన్ని యుగాలైంది ఆమెని చూసి? పూర్వం కంటే ముఖం గంభీరంగా అయినా మరింత అందంగా వుంది. శివరావు మనస్సు ఒక్కసారిగా ఆహ్లాదమయమైంది.

"గుర్తుపట్టావా?" అడిగింది సుధారాణి నవ్వుతూ.

శివరావు గబగబా తలవూపాడు. "నువ్వు.... నువ్వు... ఈ కార్లో....ఎలా?" అన్నాడు ఆశ్చర్యంలో తలమునకలవుతూ. ఎన్నో ప్రశ్నలు అడగాలనుకున్నాడు. ఒక్కటీ నోరు పెగిలి రావడం లేదు. అతని అవస్థ గమనించింది సుధారాణి.

"అన్నీ వివరంగా మాట్లాడుకుందాంలే. ఎక్కడికో వెళుతున్నట్టున్నావు. సాయంకాలం కలుసుకుందామా?" అంది.

"అలాగే, అలాగే. తప్పకుండా" అన్నాడు శివరావు సంతోషంగా.

"అయితే ఎక్కడా?" అని ఒక్కక్షణం ఆలోచనలో పడి మళ్లీ తనే అంది, "రవీంద్రా పార్క్ దగ్గరికి వస్తావా? ఆరుగంటలకి."

"అలాగే. తప్పకుండా" అన్నాడు శివరావు మళ్లీ.

"సరే వస్తాను" అంటూ అతని చెయ్యి స్పృశించి"ప్రసాద్! పోనీ" అంది. కారు కదిలిపోయింది.

ఆ స్పర్శకు తన్మయుడయ్యాడు శివరావు. శరీరమంతా నూతన జీవశక్తి పాకినట్టు ఫీలయ్యాడు. అదే ప్రేమ స్పర్శ ఎనిమిదేళ్ల తర్వాత. ఈ క్షణం మరణిస్తే మాత్రమేం మళ్లీ ఆ స్పర్శ పొందగలిగాక?" అనుకున్నాడు.

తిరిగి ఈ లోకంలోకి వచ్చేసరికి ఆఫీసుకి ఆలస్యమవుతున్నట్టు గమనించాడు శివరావు. కానీ వెనుకటి ఆందోళన ఏమాత్రం లేదు. పోతే పోనీ బోడివుద్యోగం అనుకున్నాడు. మళ్ళీ నడక ప్రారంభించిన తర్వాత స్ఫురించింది, సుధారాణి పక్కనే మరోవ్యక్తి వున్నట్టు. 'భర్త కాబోలు - అయితే బాగా ఆస్తిపాస్తులున్న వ్యక్తినే చేసుకుని వుండాలి. తను తిరస్కరించినందువల్ల ఆమె జీవితం మరో మెట్టు పైకే వెళ్ళినట్టుంది. అతని పక్కన తనెంత హీనంగా కనబడివుండాలి? నలిగిన బట్టల్తో, జిడ్డోడుతున్న మొహంతో.....' శివరావు ఆఫీసులో ప్రవేశించాడు. ఆలోచనలన్నిట్నీ అణగదొక్కి రొటీన్‌గా యంత్రంలో మరగా మారిపోయాడు.

ఆరోజు శివరావు పనిలో ఎన్నడూ లేని వేగం, చురుకుదనం ప్రవేశించాయి. ఫైళ్ళు చకచకా కదలసాగాయి. పని మధ్యలో శివరావు సన్నగా ఈల వెయ్యడం గమనించి సూపరింటెండెంట్ ఆశ్చర్యపోయాడు. ఇంతలో మేనేజర్ దగ్గర్నుంచి శివరావుకి పిలుపు

వచ్చింది.

"మిస్టర్ శివరావ్! ఇది బిజినెస్ కరస్పాండెన్సా లేక లవ్ లెటరా? మధ్యమధ్య నీ సొంత కవిత్వం ఎవడేడవమన్నాడు? నార్మల్ ప్రొసీజర్ ఫాలో కాకుండా ఇదంతా యేమిటి? వెళ్ళు వెళ్ళు. ట్వంటీ మినిట్స్‌లో మళ్ళీ లెటర్ డ్రాఫ్ట్ నా టేబుల్ మీదుండాలి. అండర్ స్టాండ్?" అంటూ ఫైలు తన వైపుకి తోశాడు మేనేజర్.

"ఎస్సర్" అనే జవాబుతో ఫైలుతో తిరిగివచ్చి కుర్చీలో కూలబడ్డాడు శివరావు. ఫార్మాలిటీ, రొటీనిటీ దారి తప్పరాదు. మనస్సుతో ఆలోచించరాదు. ఉద్యోగం పోగొట్టుకోరాదు. ఫస్టుతారీకైనా జీతం గురించి దిగులుపడరాదు.

ఎప్పటికంటే తొందరగా పని పూర్తిచేసి కనీసం అరగంట ముందుగా ఆఫీసు నుంచి బయట పడాలనుకున్నాడు శివరావు. కానీ సూపరింటెండెంట్ ససేమిరా పర్మిషన్ ఇవ్వలేదు. నిన్ననే గదా పర్మిషన్ యిచ్చింది; మళ్ళీ ఇంతలో నేనా; పర్మిషన్ ఇవ్వకపోవడమేకాదు. కొత్తపని అప్పగించాడు. మొత్తం మీద శివరావు ఆఫీసు నుంచి బయటపడేసరికి ఐదున్నర అయింది.

ఎనిమిదేళ్ళ తర్వాత సుధారాణిని కలుసుకోబోతున్నాననే ఆలోచనతో ఎంతో వుద్వేగానికి లోనైంది శివరావు మనస్సు. నడుస్తున్న శివరావుకి రోడ్డుపక్కన పూలకొట్టు కన్పించింది. ఒక గులాబి పువ్వుకొని వాసన చూడకుండా భద్రంగా జేబులో పెట్టుకున్నాడు. స్టాప్ దగ్గరికి రాగానే పార్కువేపు వెళ్ళే బస్సు రెడీగా వుంది. తొమ్మిది నెలల గర్భిణిలా వుంది బస్సు. సీట్లలో, గేట్లలో, కిటికీల్లోనూ నిండిపోయిన జనం, అయినా శివరావు సందేహించలేదు. అభిమన్యుడిలా లోపలికి దూసుకు పోయాడు. జేబులో మిగిలిన చిల్లర టిక్కెట్టుకి సరిపోయింది.

బస్‌లో ఒక కాలు కిందమోపడానికే స్థలం వుంది. అటూ ఇటూ అనుకోవడానికీ పట్టుకోవడానికి మనుషులు తప్ప మరేమీ లేదు. జనం, జనం, మనుషులమీదా పక్కనాజనం. జన కూపంలో నిలబడి సుధారాణితో తన కలయికని వూహిస్తున్నాడు శివరావు. స్టాప్ వెనక స్టాప్ దాటిపోతోంది. ఎవరెవరివో చేతులు, కాళ్ళు పొడుచు కుంటున్నాయి. ఒకకాలు మొద్దుబారి పోయింది. చుట్టూ జనం వాసన. జనం చెమట వాసన. ఊపిరాడని తొక్కిసలాట. ఎనిమిది సంవత్సరాల తర్వాత సుధారాణితో కలయిక.

ఎనిమిది సంవత్సరాల కిందట ఒకనాటి రాత్రి తనూ, సుధారాణీ ఆమె తల్లి అనుమతి తీసుకుని సంగీత కార్యక్రమానికి వెళ్ళి రిక్షాలో తిరిగి వస్తున్నప్పుడు చుట్టూ వర్షం. శరీరాలు తడిసి... హిందోళరాగంలో హృదయాలు తడిసి... తడిసిన ముంగురులు సుధారాణి నుదుటిపై పడుతుండగా చూసి... ఆమె కన్నుల్లో అందమైన నీలినీడలు చూసి భరించలేని అనుభూతితో అసంకల్పితంగా ఆమె పెదాలు ముద్దాడిన క్షణం... ఆమె కన్నుల్లో కోటి మెరుపులు మెరిసిన క్షణం... క్షణికమై శాశ్వతమైన క్షణం... ఆ అనుభూతి

- ఎవరో కాలు తొక్కారు. శివరావు ప్రాణం జలార్చుకు పోయింది. దిగాల్సిన స్టాపు రాగానే శివరావు మనుషుల్ని తోసుకుంటూ తోసి వేయబడుతూ బస్సు దిగాడు. శివరావును దిగబెట్టిన బస్సు అతని మొహంపై పొగ, దుమ్ము చిలకరించి వెళ్ళిపోయింది.

కాళ్ళూ చేతులు స్వాధీనంలోకి తెచ్చుకున్నాడు శివరావు.నలిగిన బట్టల్నీ, చెదిరిన జుట్టునీ సరిచేసుకున్నాడు. పార్కుబయట అతని కోసమే చూస్తూవుంది సుధారాణి, శివరావు నరనరాల్లో నూతనోత్సాహం పెల్లుబికింది. ఎనిమిది సంవత్సరాల గతంలోకి వెళ్ళి పోయింది అతని మనస్సు. అ ప్రయత్నంగా జేబులోని గులాబీ తీసి ఆమెకందించాడు. ఇద్దరి చూపులూ ఒకేసారి పువ్వుమీద వాలాయి. చెమటకి తడిసి, ఒత్తిడిలో నలిగి, వాడి పోయింది పువ్వు. శివరావు మనస్సు విలవిల లాడింది.

"ఫర్వాలేదులే" అని సుధారాణి ఆ పువ్వునే భద్రంగా జడలో పెట్టుకుంది. ఇద్దరూ పార్కు లోపలికి వెళ్ళి ఒకమూల కూర్చున్నారు. ఆమె చేతినందుకుని నడవాలని ఎంతగానో అన్పించినా నిగ్రహించుకున్నాడు. ఆమె యిప్పుడు మరొకరి భార్య.

"అయామ్ సారీ" అన్నాడు శివరావు కూర్చుంటూ, నలిగిన పువ్వునిచ్చినందుకు. సుధారాణి గలగలా నవ్వింది "ఎనిమిదేళ్ళనాడు చెప్పాల్సిన మాట ఇప్పుడు చెబుతున్నావా? ఊఁ దానికేం గానీ ఏమైనా సంగతులు చెప్పు."

శివరావు ఏమీ మాట్లాడలేకపోయాడు. ఉద్వేగంతో గొంతుకేదో అడ్డుపడినట్ట య్యింది. తదేకంగా ఆమె మొహంవంకే చూస్తూండి పోయాడు. అప్పటికీ ఇప్పటికీ ఎంతో మార్పు కన్పించింది ఆమెలో. కళ్ళలో చురుకుపాలు తగ్గి గాంభీర్యం చోటు చేసుకుంది. మొహం ఛాయతగ్గింది. చీరకట్టులో అలంకరణలో ఎక్కడో రేఖా మాత్రంగా కృత్రిమత్వం కన్పించసాగింది.

"ఏమిటి నా కళ్ళల్లోకి అదేపనిగా చూస్తున్నావు? వెనకటి కవిత్వం గుర్తు కొచ్చిందా?" సుధారాణి అడిగింది, ఒక చేతిని నేలకానించి.

శివరావు సిగ్గుపడ్డాడు. ఆనాడు సముద్రం ఒడ్డున తను విన్పించిన కవిత గుర్తుకొచ్చింది.

"ఆ కవిత్వాలన్నీ ఆగిపోయాయి. జీవితం లయతప్పినట్టుగా వుంది. మళ్ళీ యిన్నాళ్ళకి..."

"హృదయం కొట్టుకుంటోందా? జాగ్రత్త, పగిలిపోగలదు." అంది సుధారాణి.

"ఎగతాళి చేస్తున్నావా?"

"లేదులే, సరదాకి శివా! నువ్వెందుకో బాగా తగ్గిపోయావు"

"అవును, అన్నివిధాలా, ఏవేవో సాధించాలనుకున్నాను. ఏమీ సాధించలేక పోయాను. బతుకుకోసం ఎన్నిటితోనో రాజీ పడాల్సి వచ్చింది. ఇప్పుడనిపిస్తుంటుంది. జీవిత నిశ్వాసం కోల్పోయి అన్నిటితో రాజీపడటమంటే మరణించడమేనని."

సుధారాణి మౌనం వహించింది "పెళ్ళికి నన్ను పిలవలేదుగా? పిల్లలెంతమంది?"

C. P. BROWN
MEMORIAL LIBRARY
Acc. No.
Date
CUDDAPAH.



చెప్పాడు శివరావు. "మరి నీకు?"

సుధారాణి నవ్వింది "నాకింకా పెళ్ళి కాలేదు"

శివరావుకి షాక్ తగిలింది "ఎందుకని?" అడిగాడు.

"విరక్తి కాదులే, నీ పెళ్ళితో మా అమ్మ మంచంపట్టింది, నా చదువూ, చెల్లిచదువూ ఆగిపోయింది. ఏదో ఒకపని చెయ్యాల్సివచ్చింది. కొన్నాళ్ళు టైలరింగ్ షాపులో బట్టలు కుట్టాను. బట్టల షాపులో సేల్స్ గర్ల్‌గా వున్నాను. చివరికి మద్రాసులో ఒక ఫైనాన్స్ కంపెనీలో జనరల్ మేనేజర్ పర్సనల్ సెక్రటరీగా చేరాను. అప్పటికి అమ్మ చనిపోయింది. నాకూ పెళ్ళివయసు దాటిపోయింది. ఎవ్వరూ తనంత తానుగా నన్ను పెళ్ళాడుతాననలేదు. పెళ్ళి అంత అత్యవసరంగా నాకూ అన్పించలేదు. ఈ లోకంలో అందంతో బతకటం తేలికే."

"మరి మీ చెల్లి?"

"ఎవడితోనో లేచిపోయింది" నిర్వికారంగా చెప్పింది సుధారాణి.

శివరావు నిశ్చేష్టుడయ్యాడు. ఎంత తెలివైంది రాధ? చివరికి ఎవరితోనో?... ఏం మాట్లాడాలో తోచలేదు క్షణం సేపు తర్వాత మెల్లిగా అన్నాడు.

"ఒకరకంగా మీ పరిస్థితికి నేనే కారణం గదూ?"

"నువ్వేమీ గిల్టీగా ఫీల్ కానవసరం లేదు. శివా! మన మనస్సులు, అనుభూతులు దేనికో తాకట్టుపెట్టబడ్డాయి. అది తెలియనప్పుడు హాయిగా అమాయకంగా వున్నాం. తెలిసిన తర్వాత నిస్సహాయంగా వుండిపోతున్నాం."

శివరావు ఏమీ మాట్లాడలేదు, నిశ్శబ్దంగా కొంతసమయం గడిచిపోయింది. పార్కులో ట్యూబులైట్లు మిలమిల లాడుతున్నాయి. జనం పల్చబడుతున్నారు.

"ఇక వెళదామా?" అంది సుధారాణి పైకి లేస్తూ. అప్పుడు స్ఫురించింది శివరావుకి ఆమెని తన యింటికి పిలవలేదని, కానీ తన జీవితం ఆమె చూడటం ఇష్టంలేక పోయింది.

"ఎక్కడుంటున్నావు?" అని మాత్రం అడిగాడు.

"హోటల్ రిట్జ్‌లో, అతను మా బాస్, బిజినెస్ టూర్ మీద దేశాలన్నీ తిరిగుతూ ఇటు వచ్చాం." అంది.

ఇద్దరూ పార్కు బయటికి వచ్చినడవసాగారు. కొంతదూరం నడిచాక ఎవరో ఇద్దరు వ్యక్తులు పేవ్ మెంటుమీద వస్తూ తమ వంక ఎగాదిగా చూస్తూ దాటిపోయారు. ఆ వెనకే తమను గూర్చి కామెంట్ చెయ్యటం వినిపించింది శివరావుకి.

"బాగుంది గురూ!"

"రేటెంతో?"

శివరావులో రక్తం వుడుకెత్తింది. కోపంతో నిలువెల్లా వణికి పోయాడు. భరించలేని ఆవేశంతో పళ్ళుబిగించి వాళ్ళవైపు వెళ్ళబోయాడు. సుధారాణి వారించింది. అలా ఒక

ఫర్లాంగు దూరం పేవ్‌మెంటు మీద నడుచుకుంటూ వెళ్ళారు. దూరంగా రిట్జ్ హోటల్ కనబడుతోంది.

సుధారాణి ఆగి "ఇకనే వస్తాను శివా?" అంది. ఆమె కన్నుల్లో ఎంతో అసంతృప్తి.

ఒక్కసారిగా ఏదో విషాదం శివరావు నావరించింది. మనస్సులోని వుద్వేగాన్ని ఆపుకోలేక పోయాడు.

"సుధా! ఒక్కసారి నీ చెయ్యి ముద్దు పెట్టుకుంటాను." అన్నాడు వినీ వినపడనట్టు.

సుధారాణి జీవంలేని నవ్వు నవ్వింది.

"నా స్పర్శలో ఇప్పుడేం అనుభూతిపొంద గలవు శివా! బతుకుతెరువుకోసం అన్నీ అమ్ముకున్నాను. నేనిప్పుడు మా బాస్‌కి తాళికట్టని భార్యను.

శివరావు మెదడు స్తంభించిపోయింది. అంతరాంతరాళాల్లో సెగలు పొగలుగా అనుభూతుల హృదయం పగిలి ముక్కలైన చప్పుడు. కళ్ళవెంట నీరు. కన్నీటి పొరలమధ్య దూరమవుతున్న సుధారాణి ఆకారం మసక మసగ్గా కన్పించింది.

*•ఆంధ్రజ్యోతి వారపత్రిక, 10 మార్చి 1989 •*

రచన : 17.01.1986